మామిడి, జీడి రైతుల సమస్యలపై 8న కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-కొత్తవలస

జిల్లాలో మామిడి, జీడి మామిడి రైతుల సమస్యలపై ఈ నెల 8న చేపట్టే చలో కలెక్టరేట్ కార్యక్రమానికి రైతులు తరలిరావాలని ఎపి రైతు సంఘం కార్యదర్శి బి.రాంబాబు పిలుపునిచ్చారు. బుధవారం కొత్తవలస మండలంలో నిమ్మలపాలెం, పాత సుంకరపాలెం, ఎర్రవానిపాలెం, కొత్త సుంకరపాలెం, కొత్తూరు, కంటకాపల్లి, కాటకాపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 75 వేల ఎకరాలపైగా మామిడి, 15 వేల ఎకరాల్లో జీడి పంటలు ఉన్నాయని తెలిపారు. మామిడి, జీడికి ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించాలని, మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మామిడి పంటకు వాతావరణ బీమా అమలు చేసి పరిహారం చెల్లించాలన్నారు. మామిడి, జీడి కౌలుదారులకు కార్డులు ఇచ్చి, ఇ-క్రాప్ నమోదు చేసి వడ్డీ లేని రుణాలు ఇప్పించాలన్నారు. మామిడి యార్డులో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ సంఘం జిల్లా అధ్యక్షులు గాడి అప్పారావు రైతులు పాల్గొన్నారు.

జాబ్‌హబ్‌గా ఉత్తరాంధ్ర

- వెనుకబాటు తనం నుంచి ఉపాధి కల్పనవైపు
- ఎంతో అభివృద్ధి చేశాం.. మరెన్నో చేపడతాం
- ఎయిర్‌పోర్టు శంకుస్థాపన సభలో సిఎం జగన్

సభలో మాట్లాడుతున్న సిఎం జగన్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి/భోగాపురం/డెంకాడ

ఒకప్పుడు ఉత్తరాంధ్ర అంటే వలసలు పోయే శ్రమజీవులుగా ఉన్న గుర్తింపును తిరగరాసి జాబ్‌హబ్‌గా తీర్చిదిద్దుతామని సిఎం జగన్మోహన్‌రెడ్డి అన్నారు. ఉద్యోగాల కోసం ఉత్తరాంధ్రకు రావాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. విశాఖలో ఏర్పాటు కానున్న అదానీ డేటా సెంటర్ ద్వారా వైజాగ్ జాబ్‌హబ్‌గా మారబోతుందన్నారు. సబ్ మెరైన్ కేబుల్ కనెక్టివిటీ.. ఐటి రంగం అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందన్నారు. ఒకవైపున శ్రీకాకుళం జిల్లా మూలపాడు పోర్టు, మరోవైపు అంతర్జాతీయ విమానాశ్రయం ఇవన్నీ రూపురేఖలు మారుస్తాయని చెప్పారు. టూరిజం, మెడికల్ టూరిజం, ఐటి ఇండస్ట్రీ పరంగా సాధించాల్సిన ప్రగతికి కూడా ఎయిర్‌పోర్టు రాబోయే రోజుల్లో కేంద్రబిందువుగా మారుతుందని తెలిపారు. తద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయన్నారు.

భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నిర్మాణం, తారకరామతీర్థసాగర్ ప్రాజెక్టు, చింతపల్లి వద్ద ఫిష్ ల్యాండింగ్ సెంటర్ పనులకు బుధవారం సిఎం జగన్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ఆకాశమంత పెద్దమనసుతో రైతులు భూములిచ్చి సహకరించారని అన్నారు. వారందరికీ పోలిపల్లి, గూడెపువలస వద్ద 50 ఎకరాల్లో రూ.80 కోట్లతో గేటెడ్ కమ్యూనిటీ తరహాలో రెండు పునరావాస గ్రామాలను ప్రభుత్వం నిర్మించి తరలించిందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కోర్టు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో అనేక కేసులన్నింటినీ పరిష్కరించామన్నారు. మరోవైపు భూసేకరణ కూడా పూర్తి చేసి, కేంద్రం నుంచి అన్ని అనుమతులు తీసుకొచ్చామన్నారు. గతంలో చంద్రబాబు ఇవేవీ పూర్తి కాకుండా శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. తిరిగి ఏమాత్రమూ సిగ్గు లేకుండా గతంలోనే తాము శంకుస్థాపన చేసినట్టు చెప్పుకుంటున్నారని ఎద్దేవాచేశారు.

ఉత్తరాంధ్రకు మూలపేట పోర్టు మణిహారమైతే ఎయిర్‌పోర్టు కిరీటం వంటిదని అన్నారు. విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం ప్రాంతాలకు దాదాపు సమాన దూరంలో ఉన్న ఈ ఎయిర్‌పోర్టు కేవలం ఉత్తరాంధ్రకే కాకుండా రాష్ట్రానికి కేంద్ర బిందువు కాబోతుందన్నారు. ఇందుకనుగుణంగా ఉత్తరాంధ్రలోనూ, ఇతర ప్రాంతాల నుంచి రహదారులను అనుసంధానం చేస్తామని వివరించారు.

విజయనగరం మెడికల్ కాలేజీని ఈ ఏడాది ఆగస్టు లేదా సెప్టెంబరులో ప్రారంభిస్తామన్నారు. సాలూరులో తలపెట్టిన గిరిజన యూనివర్సిటీకి భూసేకరణ పూర్తయిందని, ఈ ఏడాది జూన్ లేదా జూలైలో శంకుస్థాపన చేస్తామని వెల్లడించారు.

పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా గ్రామం నుంచి జిల్లా స్థాయికి మాత్రమే కాకుండా.. రాజధానుల స్థాయికి కూడా తీసుకెళ్లాలన్నది తమ ప్రభుత్వ విధానమన్నారు. అందులో భాగంగా అందరికీ ఆమోదయోగ్యమైన నగరం విశాఖను పరిపాలన రాజధానిగా చేస్తామన్నారు. ఈ నేపథ్యంలో సెప్టెంబరులో విశాఖలో కాపురం పెడతానని చెప్పారు.

పేదలకు ఇళ్ల ఇళ్లపట్టాలు అందనీయకుండా బాబు కోర్టుకు వెళ్లి అడ్డుకోవాలని ప్రయత్నం చేశారని ఆక్షేపించారు. త్వరలో డిజిటల్ లైబ్రరీలు కొన్ని గ్రామాల్లో కడుతున్నామని, వర్క్ ఫ్రం హోం వంటివాటికి దోహదపడతాయని అన్నారు. 28 ఏళ్లలో బాబు వల్ల రాష్ట్రానికి ఎలాంటి మేలూ జరగలేదన్నారు. చంద్రబాబు, జగన్‌కు మధ్య తేడా ప్రజలు గమనించాలని, తాను చేపట్టిన పథకాల వల్ల మంచి జరిగిందనుకుంటే ఆశీర్వదించాలని కోరారు.

జిఅంతకు ముందు కలెక్టర్ నాగలక్ష్మి, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డిప్యూటీ సిఎం రాజన్నదొర, మంత్రులు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, గుడివాడ అమర్‌నాథ్, సీదిరి అప్పలరాజు, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఉత్తరాంధ్రకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థసాగర్, ఫిష్‌ల్యాండింగ్ సెంటర్ పనులకు శంకుస్థాపన చేస్తున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

ఎయిర్‌పోర్టు నమూనాను పరిశీలిస్తున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

నెల్లిమర్లకు సిఎం వరాల జల్లు

నెల్లిమర్ల నియోజకవర్గంపై సిఎం జగన్మోహన్‌రెడ్డి వరాల జల్లు కురిపించారు. భవిష్యత్తులో ఈ ప్రాంతం అన్ని విధాలా అభివృద్ధి చెందేందుకు వీలుగా సహకరిస్తానని హామీ ఇచ్చారు. భోగాపురం ఎయిర్‌పోర్టు శంకుస్థాపన సభలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పలు అభివృద్ధి పనులు చేపట్టాలంటూ సిఎంకు విన్నవించారు. దీనికి సిఎం సానుకూలంగా స్పందిస్తూ... రూ.10 కోట్లతో కందివలస గెడ్డ మీద బ్రిడ్జి, దీనికి అనుబంధంగా చింతపల్లి, మెంటాడ మధ్య రోడ్డు నిర్మాణాలు చేపడతామన్నారు. దారపురెడ్డి - పాలెం వద్ద చంపావతి నదిపై రూ.2 కోట్లతో కాజ్‌వే, రూ.1.50 కోట్లతో కాలువ మరమ్మతులు చేపడతామన్నారు. రూ.2.50 కోట్ల వ్యయంతో తుమ్మలపేట - గరికపేట బిటి రోడ్డు, మరో రూ.2.50 కోట్లతో కొండవెలగాడ - రోళ్లవాకకు బిటి రోడ్డు చేపట్టేందుకు నిధులు మంజూరు చేస్తామని హామీనిచ్చారు. భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో 46 తీర ప్రాంత గ్రామాలకు రూ.35 కోట్లతో తాగు నీటి సౌకర్యం కల్పిస్తామన్నారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో ఎయిర్‌పోర్టు

జిఎంఆర్ గ్రూప్ చైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు

ఢిల్లీ, హైదరాబాద్ ఎయిర్‌పోర్టులకు దీటుగా ప్రపంచస్థాయి ప్రమాణాలతో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్మిస్తామని జిఎంఆర్ గ్రూపు చైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు చెప్పారు. ఇప్పటివరకు తమ సంస్థ ప్రపంచవ్యాప్తంగా 11 ఎయిర్‌పోర్టులను నిర్మించిందని, 12వ ఎయిర్‌పోర్టును తమ ప్రాంతమైన ఉత్తరాంధ్రలోని భోగాపురంలో నిర్మిస్తుండటం.. తన జీవితంలో గొప్ప విషయమని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో హైదరాబాద్ ఎయిర్‌పోర్టును నిర్మించి, ఆయన హయాంలోనే ప్రారంభించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ ఎయిర్‌పోర్టు వల్ల తెలంగాణా ముఖచిత్రమే మారిపోయిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి ఎంతో దూరదృష్టి, ముందుచూపు ఉన్నవారని, ఎయిర్‌పోర్టు, సీపోర్టులకు ప్రాధాన్యతనిస్తూ, రాష్ట్ర భవిష్యత్తును అభివృద్ధి పథాన, ప్రగతిపథం వైపు నడిపిస్తున్నారని కొనియాడారు. మన సంస్కృతిని గుర్తు చేసేవిధంగా, భోగాపురం ఎయిర్‌పోర్టును రూపొందిస్తామని, మూడేళ్లలో నిర్మాణాన్ని పూర్తి చేస్తామని తెలిపారు.

అగ్నిమాపక వాహనంపై కూలిన కటౌట్

అగ్నిమాపక వాహనంపై పడిన కటౌట్

ఎయిర్‌పోర్టుకు శంకుస్థాపన నేపథ్యంలో భారీ కటౌట్లను ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి సభా వేదిక వద్దకు చేరుకున్న వెంటనే భారీ ఎత్తున వర్షం కురవడంతో వేదిక ప్రాంగణ సమీపమంతా జల మయమైంది. చిన్న ఈదురు గాలులు వీయడంతో పక్కనే అందుబాటులో ఉంచిన అగ్ని మాపక వాహనంపై కటౌట్ పడింది. ఆ సమయంలో ఎవరూ అక్కడ లేక పోవడంతో ప్రమాదం తప్పింది. తర్వాత సిబ్బంది కటౌట్ తొలగించి వాహనాన్ని పక్కకు తీశారు.

- ఎండతీవ్రతకు సభా ప్రాంగణం బయట ఇద్దరు మహిళలు సొమ్మసిల్లి పడిపోయారు.వెంటనే వారికి అధికారులు 108 వాహనాన్ని రప్పించి, వైద్య సేవలందించారు.

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణపై రాస్తారోకోలు

- మోడీని ప్రశ్నించే ధైర్యం లేదా?
- సిఎం జగన్‌ను నిలదీసిన కార్మిక, ప్రజా సంఘాలు
- ఆందోళనకు వామపక్షాలు, కాంగ్రెస్ మద్దతు

రాస్తారోకో చేస్తున్న కార్మిక, ప్రజా సంఘాల, వామపక్షాల, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యాన బుధవారం పలుచోట్ల రాస్తారోకోలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పిలుపులో భాగంగా విజయనగరం జిల్లా కేంద్రంలో ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేయడానికి బిజెపి ప్రభుత్వం కంకణం కట్టుకుందని విమర్శించారు. రాష్ట్రంలో ఉన్న ఏకైక ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగంలోనే నిలబెట్టుకోవడానికి రెండేళ్లుగా విశాఖ స్టీల్ కార్మికులు, నిర్వాసితులు, కార్మిక, ప్రజాసంఘాలు, పలు రాజకీయ పార్టీలు ఎన్నో ఉద్యమాలు పోరాటాలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం దున్నపోతు మీద వాన కురిసినట్టు వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తున్న మోడీని ప్రశ్నించే ధైర్యం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి లేదా? అని నిలదీశారు. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడానికి చేపడుతున్న పోరాటంలో బాసట నిలిచి, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై రణభేరి మోగించడానికి ప్రజలు, కార్మికులు, యువత, విద్యార్థులు, మహిళలు పెద్ద ఎత్తున కదలిరావాలని పిలుపునిచ్చారు. రాస్తారోకోకు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, సిపిఐ నాయకులు ఎస్.రంగరాజు, డిసిసి అధ్యక్షులు సరగడ రమేష్ మద్దతు తెలిపి, పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో ఎపి మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత పావని, నాయకులు కె.స్రవంతి, ఎ.రాములు, ఎ.జగన్నాథం, బూర వాసు, సిఐటియు నాయకులు బి.రమణ, జగన్మోహన్, లక్ష్మి, యుఎస్ రవికుమార్, ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రామ్మోహన్, హర్ష తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రయివేటీకరణ చేయడం దుర్మార్గమని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, పిసిసి సభ్యులు ముమ్వల శ్రీనివాసరావు, ముగడ వెంకటరమణ, సిపిఐ ఎంఎల్ ప్రజాపందా జిల్లా నాయకులు వి.కృష్ణ అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఎన్‌టిఆర్ బొమ్మ వద్ద బుధవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ విధానాలతో దేశానికి తీవ్ర నష్టమన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాల్సిన కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అప్పగించడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ నాయకులు ఎస్.గోపాలం, ఎ. సురేష్, జి.శ్రీనివాస్, ఎం.శ్రీనివాస్, ఎస్‌ఎఫ్ఐ జిల్లా నాయకులు మణికుమార్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస : విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపాలని సిఐటియు నాయకులు గాడి అప్పారావు ఆధ్వర్యంలో కొత్తవలస మూడు రోడ్ల జంక్షన్లో రాస్తారోకో చేశారు. ప్రభుత్వ ఆస్తులను ప్రయివేటీకరించి, కార్పొరేట్లకు బిజెపి ప్రభుత్వం ధారాదత్తం చేయాలని చూస్తోందని అప్పారావు ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఆటో, ముఠా, ఉపాధి హామీ తదితర కార్మికులు పాల్గొన్నారు.

రామభద్రపురం : విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణను వెంటనే నిలుపు చేయాలని సిపిఎం మండల నాయకుడు బలస శ్రీను, సిపిఐ నాయకులు అలమండ అనందరావు డిమాండ్ చేశారు. ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ విధానాలను తిప్పి కొట్టి కేంద్రాన్ని ప్రశ్నించాల్సిన వైసిపి, టిడిపి మౌనంగా ఉండడం హేయమని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు వెంకీ, వడిపిల్లి గోవింద్, దాలయ్య, శంకరి, బాలు పాల్గొన్నారు.



బొబ్బిలి, కొత్తవలస, రామభద్రపురంలో రాస్తారోకోలు చేస్తున్న కార్మిక, ప్రజా సంఘాలు, వామపక్షాల నాయకులు, కార్యకర్తలు

నేటి నుంచి మొక్కజొన్న కొనుగోలు

జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా వ్యాప్తంగా గురువారం నుంచి మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు చేస్తామని జెసి మయూర అశోక్ అన్నారు. జిల్లాలో 23,500 హెక్టార్ల విస్తీర్ణంలో మొక్క జొన్న పంట రబీ పంటకాలంలో సాగు అవుతుందని దీనికి గాను 2,07,300 మెట్రిక్ టన్నుల మొక్క జొన్న వుత్పత్తి జరగుతుందని అంచనా వేశామన్నారు. ప్రస్తుతం జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో మొక్క జొన్న కనీస మద్దతు ధర కన్నా(రూ.1962) తక్కువకు రైతులు అమ్మకాలు జరుపుతున్నారన్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. దీంతో మార్క్‌ఫెడ్ ద్వారా కనీస మద్దతు ధరకు కొనుగోలు చెయ్యాలని ప్రభుత్వానికి లేఖ రాయడంతో అనుమతి వచ్చిందన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తామన్నారు. మొక్క జొన్న అమ్మదలచిన రైతులు తమ తమ రైతు భరోసా కేంద్రాలలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

ఖాతా నుంచి రూ.22 వేలు మాయం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని లంక వీధికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు ఉగిరి లక్ష్మణరావు ఖాతా నుండి రూ. 22 వేలు మాయమైనట్లు బుధవారం యూనియన్ బ్యాంకు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈనెల రెండో తేదీన సాయంత్రం రూ. 2వేలు, రాత్రి మరో రూ. 10వేలు, బుధవారం ఉదయం రూ. 10వేలు గుర్తు తెలియని వ్యక్తులు ఖాతా నుంచి నగదు మాయం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. గతంలో కూడా ఇదే బ్యాంకు నుండి మండల కేంద్రానికి చెందిన భోగి శ్రీధర్, భోగి ప్రదీప్‌లకు చెందిన ఖాతాల నుండి నగదు మాయమైన విషయం తెలిసిందే. వీటిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపి తమకు న్యాయం చేయాలని బాధితులు బ్యాంకు అధికారులను వేడుకొన్నారు.

ప్రజా ఉద్యమాల బలోపేతమే శ్రీరామ్మూర్తికి నివాళి

సిఐటియు జిల్లా నాయకులు ఎం.శ్రీనివాస

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

దేశంలో పెరుగుతున్న మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు బలోపేతం చేయడమే రెడ్డి శ్రీరామ్మూర్తికి నిజమైన నివాళని సిఐటియు జిల్లా నాయకులు ఎం.శ్రీనివాస అన్నారు. స్థానిక ఎల్‌బిజి భవన్‌లో సిపిఎం నేత రెడ్డి శ్రీరామ్మూర్తి రెండో వర్థంతిని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ముందుగా శ్రీరామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో సిపిఎం అభివృద్ధికి శ్రీరామ్మూర్తి విశేష కృషి చేశారని కొనియాడారు. తోటపల్లి రైతుల పోరాటంలో ముందుండి నడిపించారన్నారు. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడే వ్యక్తి అని, ఆయన బాటలో నేటితరం నడవాలని పిలుపునిచ్చారు. గిరిజనుల సమస్యలపై నిత్యం పోరాటం సాగించారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.లక్ష్మి తెలిపారు. మహిళా పక్షపాతిగా నిలిచి, ఏ సమస్య వచ్చినా నేనున్నానని ధైర్యాన్నిచ్చిన వ్యక్తని కొనియాడారు. శ్రీరామ్మూర్తి భార్య శ్రీదేవిని ప్రోత్సహించి మహిళా ఉద్యమాలు నిర్మించడంలో ముందున్నారని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.రమణమ్మ అన్నారు. నేటితరం శ్రీరామ్మూర్తి జీవితం నుంచి నేర్చుకుని ప్రజా ఉద్యమాలు నిర్మించాలని రెడ్డి శంకరరావు కోరారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ జగన్ మోహన్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు బి.రమణ, సిఐటియు జిల్లా నాయకులు యుఎస్ రవికుమార్, ఎస్‌ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రాము, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆనంద్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు హరీష్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం, సిఐటియు, ప్రజా సంఘాల నాయకులు

రెవెన్యూ పితలాటకం

- అధికార పార్టీకి అనుకూలంగా అధికారులు
- చెరువులు, కాలువల ఆక్రమణలపై ఉదాసీనత

'రాజు తలుచుకుంటే దెబ్బలకు కొదవేముంది' అన్న చందంగా ఉంది మండలంలోని అధికార పార్టీ పెద్దల వ్యవహారం. మండలంలోని అన్ని వ్యవస్థలను తమ గుప్పెట్లో పెట్టుకుని వారికి నచ్చినట్లు వ్యవహరిస్తున్న తీరు జామి మండలంలో ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. జామి గ్రామంలో కొద్ది రోజులుగా నడుస్తున్న ఓ భూ వివాదాన్ని పరిశీలిస్తే... వ్యవస్థలన్నీ అధికార పార్టీకి ఎంతగా కొమ్ముకాస్తున్నాయో అర్థమవుతోంది.

ప్రజాశక్తి - జామి

జామి గ్రామంలో సర్వే నంబర్ 6791ఎ లో 1.71 ఎకరాల జిరాయితీ భూమి ఉంది. ఇది వైశ్య సామాజిక తరగతికి చెందినది. 1972 రికార్డు ఆధారంగా అప్పటికే ఈ భూమిలో ధాన్యం మిల్లు, పెంకుటిల్లు, పలు కట్టడాలు ఉన్నాయి. భూ యజమాని నుంచి ముగ్గురు వ్యక్తుల చేతులు మారి 1973లో అదే సామాజిక తరగతికి చెందిన ఓ సాదారణ కుటుంబం 34 సెంట్లు కొనుగోలు చేసింది. ఆ భూమికి రిజిస్ట్రేషన్ కూడా జరిగింది. అధికారులు వన్‌బి కూడా ఇచ్చారు. ఇంత వరకు బాగానే ఉంది. మిగిలున్న భూమిలో కొంత ఆ కుటుంబం ఉంచుకుని, 2006లో ఎకరా భూమిని మాత్రం వైసిపి నాయకుడికి విక్రయించారు. సరిగ్గా ఇక్కడే అసలు సమస్య మొదలైంది. ఆ భూమికి ఒకపక్క జాగారం - అన్నంరాజుపేట ఇరిగేషన్ కాలువ, మరోవైపు సామాన్య కుటుంబం కొన్న (34 సెంట్లు) భూమి అడ్డంగా ఉంది. వైసిపి నాయకుడి భూమికి రహదారి సమస్యగా మారింది. దీంతో ఆ నాయకుడు కాలువ ఆక్రమణకు గురైనట్లు ఫిర్యాదులు చేయించి అటు ఇరిగేషన్ అధికారులను, తమ చెప్పుచేతల్లో ఉన్న రెవెన్యూ అధికారులను రంగంలోకి దించారు. ఇరిగేషన్ అధికారులు రెవెన్యూకి జెఎ ఛానల్ ఆక్రమణలు తొలగించాలని లెటర్ పెట్టించారు. అంతే ఆగమేఘాలపై వైసిపి నాయకుడుకు అడ్డంగా ఉన్న భూమిలో ప్రభుత్వ భూమి అని బోర్డులు పెట్టేయడం చకచకా జరిగిపోయింది. ఇదేమిటని అడిగితే, అది వాగు అని బెదిరించడం మొదలు పెట్టారు. అయితే తమకు వన్ బి ఇచ్చారు... ఆ భూమి సంగతి ఏమిటని అడిగితే, అది తమకు సంబంధం లేదని చెప్పుకొస్తున్నారు. వాస్తవానికి ఇరిగేషన్ వారు చెప్పిన జెఎ ఛానల్ ఆక్రమణల జోలికి వెళ్ల లేదు. కానీ, వైసిపి నాయకుడి భూమికి అడ్డంగా ఉన్న భూమిపై మాత్రం చర్యలకు ఉపక్రమిస్తున్న వైనం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

గ్రామంలో చెరువులు ఆక్రమణపై ఇప్పటికే ఇరిగేషన్ శాఖ రెవెన్యూ అధికారులకు అనేక సార్లు లేఖలు రాసిన విషయం తెలిసిందే. అవన్నీ కార్యాలయాల్లో బుట్టదాఖలయ్యాయి. వాటిపై ఇసుమంతైనా స్పందించని అధికారులు, వైసిపి నాయకుడి ఆదేశాలతో ఆగమేఘాలపై 50 ఏళ్లుగా అక్కడే నివాసం ఉంటూ, భూమిపై అన్ని హక్కులు ఉన్న ఓ సామాన్య వ్యక్తి భూమిపైకి వెళ్లి బోర్డులు పాతేయడం గమనార్హం. పైగా 50 ఏళ్ల క్రితం నిర్మించిన ఇల్లు వాకిళ్లు కూడా తొలగిస్తామని బెదిరించడం ఎంత వరకు సబబని ప్రజలు ముక్కున వేలేసుకుంటు న్నారు. జెఎ ఛానల్ ఆక్రమణలు తొలగించాలని అనుకుంటే, కాలువ ఆనుకుని ఉన్న వైసిపి నాయుకుల భూముల్లో కూడా అధికారులు బోర్డులు పెట్టాలి. కానీ కేవలం అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు లొంగి, సామాన్యుల జీవితాల్లో రెవెన్యూ పితలాటకం పెట్టీ ఆడుకోవడం సరికాదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెవెన్యూ అధికారులు ఏర్పాటుచేసిన బోర్డు

జనసేన మండల అధ్యక్షులుగా శాసపు

మనోహర్‌తో అప్పలనాయుడు

రేగిడి : జనసేన మండల అధ్యక్షులుగా సరసనాపల్లికి చెందిన శాసపు అప్పలనాయుడుని కేంద్ర కార్యాలయం నియమించింది. ఈ మేరకు ఆ పార్టీ నాయకులు నాదెండ్ల మనోహర్ ఆయనకు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి నియామక పత్రం తీసుకున్నారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తన సేవలను గుర్తించి ఇంత పెద్ద బాధ్యతను అప్పజెప్పినందుకు ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా తన వంతు కృషి చేస్తానని అన్నారు. పార్టీ సిద్ధాంతాలను గడపగడపకు తీసుకు వెళ్తానని చెప్పారు.

ఎట్టకేలకు ప్రధాన రహదారి పనులు

వీరఘట్టం : మండల కేంద్రంలోని ప్రధాన రహదారి విస్తీర్ణం, అభివృద్ధి పనులు బుధవారం ఎట్టకేలకు ప్రారంభించారు. గ్రామంలో ఈనెల 7, 8, 9 తేదీల్లో పైడితల్లి అమ్మవారి గ్రామదేవత ఉత్సవాల్లో భాగంగా తెలగవీధి జంక్షన్ నుంచి అంబేద్కర్ జంక్షన్ వరకు గ్రామదేవత ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఆటంకాలు ఉండకుండా ఉండేందుకు ఉన్న రహదారిని జెసిబిల ద్వారా తొలగించి ప్రస్తుతం వాటిపై 40 ఎంఎం గల చిప్స్ వేసి రోలింగ్ చేస్తున్నారు. మరోవైపు కాలువలపై పలకలు అమర్చేందుకు ముమ్మరంగా చేపడుతున్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ జాబ్ కార్డు

పాచిపెంట : అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ చట్టం ద్వారా జాబ్ కార్డులు మంజూరు చేసే పని కల్పిస్తామని డ్వామా పీడీ కె. రామచంద్రరావు తెలిపారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద విలేకర్లతో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది రూ.1.23కోట్ల పని దినాలు వేతన దారులకు కల్పించనున్నట్లు తెలిపారు. ఉపాధి పథకం ద్వారా 60 శాతం వేతన దారులకే మిగతా 40 శాతం మిషనరీలు ద్వారా అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. 60 శాతం వేతనదారులకే సంబంధించి రూ.3.33 కోట్ల మెటీరియల్ రూపంలో రూ. 2.23కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా ప్రధానంగా సాగునీటి కాలువలు చెరువుల అభివృద్ధికి ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు తెలిపారు. అర్హులను గుర్తించి జాబ్ కార్డులు మంజూరయ్యేలా చూడాలని గ్రామ వాలంటీర్లకు ఆదేశించారు. 124 కిలోమీటర్ల పొడవున సాగునీటి కాలువలను వచ్చే ఏడాది మార్చి నాటికి అభివృద్ధి చేస్తామన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి

బొండపల్లి: రక్తదానానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు అబ్దుల్ రఫాక్ అన్నారు. మండలంలోని గొట్లాం గాయత్రి జూనియర్ కళాశాలలో బుధవారం రక్తదానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాల కన్నా రక్తదానం చాలా గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మురళీ, అధ్యాపకులు అర్చెపల్లి సింహాచలంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జనసేన నాయకుల ముందస్తు అరెస్టులు

డెంకాడ : సిఎం జగన్మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో జనసేన నాయకులు పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. బుధవారం తెల్లవారు జామునుంచే బాడంగి ఎస్ఐ బాడంగి జయంతి ఆధ్వర్యంలో 20మంది పోలీసులు జనసేన ఉత్తరాంధ్ర మహిళ రీజనల్ కో ఆర్డినేటర్ తుమ్మి లక్ష్మీ రాజ్, ఆమె భర్త ఉమ్మడి జిల్లా జనసేన నాయకులు తుమ్మి అప్పలరాజు దొరను వారి ఇంటి వద్ద హౌస్ అరెస్టు చేశారు. అనంతరం డెంకాడ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రశ్నించే వారిని చూస్తే జగన్మోహన్‌రెడ్డికి భయమెందుకని ప్రశ్నించారు.

ఘనంగా అయ్యలు జన్మదిన వేడుకలు

రోగులకు మందులను పంపిణీ చేస్తున్న అయ్యలు

విజయనగరం టౌన్ : జనసేన నాయకులు గురాన అయ్యలు జన్మదిన వేడుకలను జనసేన నాయకులు, అభిమానులు బుధవారం నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జొన్నగుడ్డిలో మెడికవర్ ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం, పుష్పగిరి ఆసుపత్రి సౌజన్యంతో కంటివైద్య శిబిరం నిర్వహించారు. పెద్ద ఎత్తున పేదలు వైద్య సేవలను వినియోగించుకున్నారు. వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం వెలుగు ఆశ్రమం, పినవేమలి ఆశ్రమం, నిరాశ్రయుల వసతిగృహం, పలు దేవాలయాల్లో అన్నప్రసాద వితరణ నిర్వహించారు. పలుచోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేసి మజ్జిగ పంపిణీ చేశారు. న్యూలైఫ్ బ్లడ్ బ్యాంకులో యువత పెద్ద ఎత్తున రక్తదానం చేశారు. అనంతరం జిఎస్ఆర్ హోటల్లో అభిమానులు సమక్షంలో బర్త్‌డే కేక్‌ను కట్‌చేసి వేడుకలు జరుపుకున్నారు. జిల్లాలోని జనసేన నాయకులు, కార్యకర్తలు పుష్పగుచ్ఛాలతో అయ్యలుకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గురాన అయ్యలు విరీడియాతో మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను స్ఫూర్తిగా తీసుకుని తన జన్మదినం రోజున అభిమానులు పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలను నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. జిల్లాలో జనసేన బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున జనసేన నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు పాల్గొన్నారు.

జగన్ పాలనలో 20 ఏళ్లు వెనక్కి

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

వైయస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత అనుసరించిన విధానాల వల్ల అభివృద్ధిలో రాష్ట్రం 20ఏళ్ళు వెనక్కి వెళ్లిపోయిందని మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు అన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలు వెనక్కి మళ్లిపోతున్నాయని, నిరుద్యోగం బాగా పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. నాలుగేళ్ల జగన్ పాలనలో కొత్తగా ఒక్క పరిశ్రమ రాష్ట్రానికి రాలేదని, ప్రభుత్వ పెద్దల అవినీతి, బెదిరింపుల వల్ల పారిశ్రామికవేత్తలు తిరిగి వెనక్కి మళ్లిపోతున్నారని తెలిపారు. అమరావతి పూర్తయితే రాష్ట్ర ఆదాయం, పోలవరం పూర్తి చేసి ఉంటే రైతుల ఆదాయం పెరిగేదని చెప్పారు. పిల్లల భవిష్యత్తు కోసం ప్రజలంతా ఆలోచించాలని కోరారు.

ట్రాఫిక్ కష్టాలు

పాలకొండ : మండలంలో కొండాపురంలో గ్రామ దేవత పండగ ముగింపు ఉత్సవాలు బుధవారం జరగడంతో శ్రీకాకుళం వెళ్లే రహదారి పూర్తిగా రద్దీగా మారింది. ఏలాం జంక్షన్ నుంచి గాయిత్రీ ఆలయం వరకు వాహనాలతో రద్దీగా మారింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు రాకపోకలకు కొంత ఇబ్బంది కరంగా మారింది. పోలీసులు చొరవ తీసుకుని ట్రాఫిక్‌ను సరిచేశారు.

డిసిఎంఎస్ స్థల పరిశీలన

పాలకొండ : పట్టణంలోని నాగవంశపువీధి జంక్షన్ దగ్గర డిసిఎంఎస్ స్థలాన్ని డిసిఎంఎస్ అధికారులు దేవరాజు పరిశీలించారు. డిసిఎంఎస్ స్థలం ఎవరూ ఆక్రమించుకోకూడదని, ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సంబంధిత వార్డు కౌన్సిలర్ ప్రతినిధి పల్లా భానుతో మాట్లాడారు. డిసిఎంఎస్ స్థలం ఎంత ఉంది, రైతు బజారుకు తాము ఎంత కేటాయించాలన్న దానిపై కూడా నివేదికలు తయారు చేస్తామన్నారు.

చెరువుల అభివృద్ధి పనుల పరిశీలన

సీతానగరం : మండలంలోని జానుములవలస, వెన్నెలబుచ్చంపేటలో జరుగుతున్న చెరువుల అభివృద్ధి పనులను ఎంపిడిఒ ఎంఎస్ఎన్ఎల్ ప్రసాద్ బుధవారంపరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన చెరువు మన గ్రామం పేరుతో ప్రభుత్వం చెరువుల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు.

72 గంటల పాటు నిరాహార దీక్ష

కురుపాం : బోయ, వాల్మీకి బెంతుఒరియా కులాలను ఎస్టీ జాబితాలో చేర్చే తీర్మానం వెంటనే వెనక్కి తీసుకోకపోతే మే 11 నుంచి మూడు రోజులపాటు (72 గంటలు) కురుపాం నియోజక వర్గ కేంద్రంలో నిరాహార దీక్ష చేపడుతున్నట్లు గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా కార్యదర్శి కె.చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే అసలైన గిరిజనులు రిజర్వేషన్లు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ ఎంతో మంది యువత చదువుకొని నిరుద్యోగులుగా మిగులుతున్నారన్నారు.

శ్రామిక రాజ్య స్థాపనకై

పోరాడిన యోధుడు ఆర్ఎస్ఎం

- వర్ధంతి సభలో వక్తలు
- శ్రీరామ్మూర్తి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు కృషి

సభలో మాట్లాడుతున్న తమ్మినేని సూర్యనారాయణ

ప్రజాశక్తి- పార్వతీపురం

కారల్ మార్క్స్ చూపిన కమ్యూనిజం బాటలో శ్రామిక రాజ్యం స్థాపనకై అలుపెరగని పోరాట యోధుడిగా పార్వతీపురానికి వన్నెతెచ్చిన కమ్యూనిస్టుగా అమరుడైన రెడ్డి శ్రీరామ్మూర్తి (ఆర్ఎస్ఎం) ఆశయాలను నెరవేర్చడమే ఆయనకు మనమిచ్చే నిజమైన ఘన నివాళి అని పలువురు వక్తలు మాట్లాడారు. రానున్న వర్ధంతికి రెడ్డి శ్రీరామ్మూర్తి విజ్ఞా కేంద్రం ఏర్పాటుకు కృషి ప్రతినబూనారు. బుధవారం స్థానిక గిరిజన సామాజిక భవనంలో రెడ్డి శ్రీరామ్మూర్తి ద్వితీయ వర్ధంతి సభ సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొల్లి గంగునాయుడు అధ్యక్షతన జరిగింది. తొలుత మున్సిపల్ చైర్‌పర్సన్ బి.గౌరీశ్వరి మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతూ మంచి కామ్రేడ్‌గా శ్రీరామ్మూర్తి పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. ఆయన అడుగుజాడల్లో నడవడమే ఆయనకిచ్చిన ఘనమైన నివాళులన్నారు. వైస్ చైర్మన్ యిండుపూరు గుణ్నేశ్వరరావు మాట్లాడుతూ పట్టణంలో పేదల సమస్యలు పరిష్కరించడం శ్రీరామ్మూర్తి ప్రత్యేకత కలిగిన కామ్రేడ్ అని కొయాడారు. పట్టణ వాసులకు ఆయన లేని లోటు తీరనిదన్నారు. పార్వతీపురం ప్రధాన రహదారిలో ఏదో ఒక జంక్షన్ వద్ద ఆయన విగ్రహం ఏర్పాటుకు తన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. డాక్టర్ యాళ్ల వివేక్ మాట్లాడుతూ తోటపల్లి నిర్వాసితుల సమస్యలపై శ్రీరామ్మూర్తి పెద్ద పోరాటం చేసి వారికి న్యాయం జరిగేలా కృషి చేసిన గొప్ప కమ్యూనిస్టు నాయకుడన్నారు. పేదల కోసం తమ వంతు సహాయ సహకారాలు అందించే వారమని, ఎల్లప్పుడూ తన సహాయ సహకారాలు ఉంటాయని అన్నారు. ప్రముఖ కవి గంటేడ గౌరినాయుడు మాట్లాడుతూ లాఠీలకు, తూటాలకు బెదరకుండా అనునిత్యం సమైక్యరాజ్యం కోసం ప్రజా జీవితాన్ని గడిపిన రెడ్డి శ్రీరామ్మూర్తి అంటే రెడ్ శ్రీరామ్మూర్తిగా పిలవడమే సముచితం అన్నారు. మరో కవి పక్కి రవీంద్ర మాట్లాడుతూ శ్రీరామ్మూర్తి నర నరాల్లోనూ కమ్యూనిజం ప్రవహించే ఉవ్వెత్తిన ఉప్పొంగే ఎర్రటి ఉద్యమ సముద్రపు కెరటమన్నారు. ఎప్పటికీ ఇంకని సముద్రపు నీరలాగే కామ్రేడ్ ఆర్ఎస్ఎం ఆశయాలకు మరణం లేదన్నారు. సిపిఎం శ్రీకాకుళం జిల్లా నాయకులు బి.కృష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ సభ్యులుగా శ్రీరామ్మూర్తితో కలిసి పనిచేయడం మా మధ్య ఉద్యమ స్నేహ సంబంధాలు మరువలేని అన్నారు. ఆయన ఉద్యమ స్ఫూర్తితో కమ్యూనిస్టులంతా పనిచేయడం ఆయనకిచ్చిన నిజమైన నివాళి అని అన్నారు. సిపిఎం విజయనగరం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్వాసితుల పోరాటంలో కలిసి పని చేసిన సందర్భాలు మరువలేనివన్నారు. భోగాపురం చేరుకునేందుకు పార్వతీపురం నుంచి పోలీసుల ఆంక్షలను అధిగమిస్తూ వారి కంటపడకుండా రాత్రంతా కాళ్ల నడకన నిద్రాహారాలు లేకుండా ఎయిర్ పోర్టు ఉద్యమంలో పాల్గొనే తీరు ఉద్యమ స్ఫూర్తికి నిదర్శనమన్నారు. అలాంటి కామ్రేడ్ భౌతికంగా దూరమైనా ఆయన ఆశయాలు సజీవంగా ఉంటాయని వాటిని కొనసాగించడమే నిజమైన నివాళులు అన్నారు. ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర కార్యదర్శి జివి కిషోర్ మాట్లాడుతూ 20 ఏళ్లుగా కార్మిక, ఉద్యోగుల సమస్యలపై శ్రీరామ్మూర్తితో కలిసి పని చేశామన్నారు. సమయస్ఫూర్తి, విషయ పరిజ్ఞానంతో సమస్యలపై పోరాడినప్పుడు మనం ఇతరుల గౌరవాన్ని పొందగలమని సలహాలిస్తూ కార్యక్రమాన్ని ముందు నడిపే వారిని గుర్తు చేశారు. ఆయన అడుగుజాడల్లో నడవడమే ఆయనకిచ్చిన ఘనమైన నివాళి అని అన్నారు. శ్రీరామ్మూర్తి భార్య నిత్యం ఆఫీసులోనే అందరికీ అందుబాటులో ఉండి పనిచేసిన శ్రీరామ్మూర్తి లేకపోవడం అంధకారంగా ఉందన్నారు. ఆయన అడుగుజాడల్లోనే నడుచుకుంటూ ఆయన ఆశయాలను కొనసాగిస్తానన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ 1987లో రెడ్డి వానివలసలో ప్రారంభమైన ఉద్యమం జిల్లావ్యాప్తంగా విస్తరింపచేయడంలో ఎం.కృష్ణమూర్తి సహకారంతో 30 ఏళ్లుగా శ్రీరామ్మూర్తితో ఉద్యమ సహజీవనం సాగించానన్నారు. మార్క్సిజం దిక్సూచిగా పనిచేసిన శ్రీరామ్మూర్తి ఆశయాలు నెరవేరడానికి ఆయన పేరున విజ్ఞాన కేంద్రం వచ్చే వర్ధంతి లోపు ఏర్పాటుకు సిపిఎం కృషి చేస్తుందని, అందుకు అందరి సహాయ సహకారాలు అందించాలని కోరారు. జనసేన నాయకులు వి.దాలినాయుడు మాట్లాడుతూ శ్రీరామ్మూర్తిలో ఉద్యమ స్మృతులు భావితరానికి గుర్తుగా పార్వతీపురంలో ఒక జంక్షన్‌కు ఆయన నామకరణతో విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తానని అందుకు అంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు శ్రీరామ్మూర్తి, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు ఎం.తిరుపతిరావు, వై.మన్మధరావు, వి.ఇందిర, జిల్లా కమిటీ సభ్యులు బంటు దాసు, కొల్లి సాంబమూర్తి, గొర్లి వెంకటరమణ, ఎన్‌వై నాయుడు, శ్రీరామ్మూర్తి కుటుంబ సభ్యులు, సిపిఐ నాయకులు టి.జీవ, జిల్లా నలుమూలల నుండి పార్టీ శ్రేణులు, సానుభూతిపరులు, శ్రేయోభిలాషులు, మహిళలు పాల్గొన్నారు..

రెడ్డి శ్రీరామ్మూర్తి ఆశయ సాధనకు కృషి

కొత్తవలస : పార్వతీపురం మన్యం జిల్లా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీరామ్మూర్తి ఆశయ సాధనకు కృషి చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాడి అప్పారావు అన్నారు. సిపిఎం పార్టీ కార్యాలయంలో బుధవారం రెడ్డి శ్రీరామ్మూర్తి రెండో వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రామభద్రపురం: స్వర్గీయ కామ్రేడ్ శ్రీరామ్మూర్తి ఉద్యమాల స్ఫూర్తి ప్రదాత అని సిఐటియు మండల కార్యదర్శి బలస శ్రీను అన్నారు. శ్రీరామ్మూర్తి ద్వితీయ వర్ధంతి సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆనందరావు, కారంగి వెంకట్, గోవింద్, దాలయ్య, బాలు పాల్గొన్నారు.

బొబ్బిలి: పార్వతీపురం మన్యం జిల్లా సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీరామ్మూర్తి ఆశయ సాధనకు పని చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సిఐటియు కార్యాలయంలో బుధవారం రెడ్డి శ్రీరామ్మూర్తి వర్ధంతి సభ నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్.గోపాలం, బాడంగి మండల కార్యదర్శి ఎ. సురేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు మణికుమార్, పాల్గొన్నారు.

కొత్తవలస: నివాళులర్పిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

నాలుగేళ్లలో ఉత్తరాంధ్రకు చేసిందేంటి?

మాజీ మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు

ప్రజాశక్తి- బొబ్బిలి

నాలుగేళ్లలో ఉత్తరాంధ్రకు సిఎం జగన్మోహన్‌రెడ్డి చేసిందేంటని, ఉత్తరాంధ్ర అభివృద్ధి ఇప్పుడు గుర్తురావడం విడ్డూరంగా ఉందని మాజీ మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు ఎద్దేవా చేశారు. ఆయన బుధవారం కోటలో విలేకర్లతో మాట్లాడుతూ జగన్ భోగాపురంలో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి మరోమారు శంకుస్థాపన చేయడం హాస్యాస్పదామన్నారు. భోగాపురంలో అంతర్జాతీయ ఎయిర్ పోర్ట్ నిర్మాణం జరగాలనే చిత్తశుద్ధితో కేంద్రాన్ని ఒప్పించి అనుమతులు తీసుకువచ్చిన ఘనత చంద్రబాబుకు, అప్పటి కేంద్ర పౌరవిమనయాన శాఖా మంత్రి అశోక్ గజపతిరాజుకి దక్కుతాయని సుజయ్ అన్నారు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు మధ్యలో ఎయిర్పోర్ట్ నిర్మాణం జరిగితే ఉత్తరాంధ్ర అభివృద్ధికి దోహదపడుతుందనే తలంపుతో ఆనాడు భోగాపురం ఎయిర్‌పోర్టు స్థలాన్ని ఎంపిక చేసి కేంద్రాన్ని ఒప్పించిన నాయకుడు చంద్రబాబు అని సుజయ్ స్పష్టం చేశారు. కొందరు వైసిపి నేతలు కోర్టులను ఆశ్రయించి స్థల సేకరణ కొంతమేర అడ్డుకున్న సంగతి జగన్ మర్చిపోయారా అని సుజయ్ ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉన్నపుడు రెండువేల ఎకరాలు అవసరం లేదు కేవలం ఐదారొందల ఎకరాలు చాలు అంటూ రైతులను రెచ్చగొట్టిన జగన్ ఇప్పుడు మాట తప్పి మడమ తిప్పారా అని మండిపడ్డారు. ఎన్నికల సమయం అసన్నమయ్యేసరికి సదరు ప్రాజెక్టులకు మరల శంకుస్థాపన కార్యక్రమాలకు జగన్ సర్కార్ దిగడం ఓ నీచమైన చర్యగా సుజయ్ అభివర్ణించారు. ఉత్తరాంధ్రలో ఒక్క సీటు కూడా గెలవలేరని పీకే టీమ్ సర్వే చెప్పడంతో జగన్ సరికొత్త డ్రామాలకు తెరాలేపారని విమర్శించారు.

సుజయ్‌కృష్ణరంగారావు

'కడలి'కి స్వర్ణ నంది అవార్డు

అవార్డును అందుకుంటున్న కడలి ప్రకాశరావు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేటకు చెందిన చిత్ర కారుడు కడలి ప్రకాశ రావు మాస్టర్‌కి స్వర్ణ నంది అవార్డు లభించింది. బుధవారం హైదరాబాదుల త్యాగరాయ గానసభ కళా క్షేత్రంలో ఆదర్శ కళా నిలయం, సాహితీ సంస్కృతి సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు స్వర్ణ నంది జాతీయ అవార్డు, ప్రశంసా పత్రం ఆదర్శ కళా నిలయం అధ్యక్షులు చీరాల ప్రకాష్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సిని, టివి నటులు ఎస్.రాజేంద్ర, జ్యోతి రెడ్డి, దైవజ్ఞ శర్మ, డాక్టర్ అరుణ సుబ్బారావు, దర్శకులు ఎస్. కుమనన్, నటులు బలగం సహదేవ్ పోతుగంటి, బలగం సత్య ఈశ్వరం తదితరులు పాల్గొన్నారు.

20న ఆనందోబ్రహ్మ

మాట్లాడుతున్న విజయ మోహనరావు

ప్రజాశక్తి- బొబ్బిలి

యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ ఆధ్వర్యంలో సకల కళా వేదిక ఆనందోబ్రహ్మ 12వ నెల ప్రదర్శన మే20 శనివారం నిర్వహిస్తామని క్లబ్ అధ్యక్షులు ఎం. విజయ మోహన్‌రావు అన్నారు. ఆ రోజు సాయంత్రం 5 గంటల నుంచి 7 వరకు స్థానిక శ్రీ కళాభారతి ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. స్థానిక సురేష్ స్కూల్లో బుధవారం ఉదయం జరిగిన ఆనందోబ్రహ్మ సభ్యుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇప్పటివరకు 11 ప్రదర్శనలు నిరవధికంగా ఇచ్చామని, ఈ 12వ ప్రదర్శనలో అన్ని రంగాల పౌరాణిక, చారిత్రక, సాంఘిక, జానపద కళలని ప్రతి బింబించే ప్రత్యేక ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. కేవలం పది రూపాయల టికెట్‌తో అన్ని వయసుల వారిని అలరించే విధంగా రెండు గంటలసేపు రూపొందించిన ఈ ప్రదర్శలను విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్క పౌరునిపై ఉందని తెలిపారు. ప్రారంభం నుండి ఇప్పటివరకు దాదాపు 2,500 మంది కళాభిమానులు తమ ప్రదర్శనలు తిలకించడం వల్ల రంగస్థలం ప్రదర్శనలకు ఆదరణ పెరుగుతోందన్న విషయం సంతోషకరమని అన్నారు. ఆసక్తిగల అన్ని వయసుల ఔత్సాహిక కళాకారులు తమను 9440744741లో సంప్రదించాలని కోరారు. సభ్యులు కరుణ కుమార్, పవిత్ర, తాడుతూరు, నాగరాజు , శ్యామల, వెంకట లక్ష్మీ, హ్యాపీ డాన్సు క్లబ్ పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కూలీలను తరలించడం దారుణం

ప్రజాశక్తి- నెల్లిమర్ల

సిఎం జగన్మోహన్ రెడ్డి జిల్లా పర్యటనలో భాగంగా జరిగే సభకు ఉపాధి కూలీలను తరలించడం దారుణమని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కిల్లంపల్లి రామారావు అన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సిఎం సభకు వెళ్ళక పోతే మస్తర్లు వేయమని చెప్పడం భావ్యం కాదన్నారు. ఇప్పటికే కూలి గిట్టు బాటు కాకుండా, సౌకర్యాలు లేకుండా ఇబ్బందులు పడుతున్న కూలీలను భయపెట్టి సభకు తరలించడం సబబు కాదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటు పరం చేస్తున్న మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వాన్ని కనీసం ప్రశ్నించలేని వైసిపి ప్రభుత్వానికి సభలు, శంకుస్థాపనలెందుకని ప్రశ్నించారు. కాగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నా పాలక ప్రతిపక్షాలు నోరు మెదపక పోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికే ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బిజెపి విరమించుకోవాలని లేని పక్షంలో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

ఆక్రమణ గుర్తింపు

వేపాడ : మండలంలోని వీలుపర్తి రెవెన్యూ పరిధిలోని దుంగాడలో సర్వే నంబరు36/1,2 జిరాయితీ భూమిలో బుధవారం సర్వే చేసి 62 సెంట్లు ప్రభుత్వ భూమి ఉన్నట్లు గుర్తించామని డిటి సన్యాసినాయుడు తెలిపారు. ప్రభుత్వ భూమికి హద్దుల ప్రకారం సర్వేరాలు వేశామన్నారు. ఈ పరిశీలనలో ఆర్ఐ రామలక్ష్మి, మండల సర్వేయర్ అప్పల నాయుడు, విఆర్ఒ రామాంజనేయులు, వేపాడ, వీలుపర్తి సచివాలయం సర్వేయర్లు పాల్గొన్నారు.

విజేతలకు నగదు పంపిణీ

వేపాడ : మండలంలోని దబ్బిరాజపేట దుర్గాలమ్మ తల్లి పండగ సందర్భంగా గత నెల 25న గ్రామంలో జరిగిన మందుగుండు సామాగ్రి కాల్పుల పోటీలో గెలిపొందిన విజేతలకు బుధవారం బహుమతులను ప్రదానం చేశారు. మొదటి బహుమతి సాధించిన నల్లబిల్లికి చెందిన వ్యక్తికి రూ.90వేలు నగదును సర్పంచ్ దండుపాటి ముత్యాలమ్మ చేతులు మీదుగా అందించారు.

బహుమతిని అందిస్తున్న సర్పంచ్

ఎఐవైఎఫ్ 64వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి- బొబ్బిలి

ఎఐవైఎఫ్ 64వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు బుధవారం పట్టణంలో గంటి ప్రసాదం స్మారక భవనం వద్ద ఘనంగా నిర్వహించారు. ఎఐవైఎఫ్ డివిజన్ కార్యదర్శి ఎస్ గణపతి అధ్యక్షతన జరిగిన వేడుకల్లో జిల్లా ప్రధాన కార్యదర్శి కోట అప్పన్న జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో జనాభా కంటే నిరుద్యోగ సమస్య రోజు రోజుకు ఘణ నీయంగా పెరుగుతుందన్నారు. పాలకుల స్వార్థ ప్రయోజానాల కోసం యువతను పక్కదారిపట్టిస్తూ ఎన్నికల సమయంలో మోసపూరిత హామీలు ఇస్తూ ఇచ్చిన హామీలు ఏవి అమలు చేయకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కాలయాపన చేస్తు నిరుద్యోగ యువతను మోసం చేస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి రవికుమార్, నాయకులు సంతోష్, ఎస్ రాంబాబు, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

20 రీడింగ్ చైర్స్ వితరణ

కుర్చీలను అందిస్తున్న రామకృష్ణ

శృంగవరపుకోట: మండలంలోని ఉసిరి గ్రామానికి చెందిన అడ్వకేట్ పిల్లా రామకృష్ణ 12 వేల రూపాయలు విలువ చేసే 20 రీడింగ్ చైర్స్‌ను బుధవారం గ్రంథాలయానికి వితరణగా అందించారు. వీరికి పాఠకులు, గ్రంథాల అధికారి దామోదర శ్రీధర్ కృతజ్ఞతలు తెలియజేశారు. దాతలు ఎవరైనా సరే గ్రంథాలయ అభివృద్ధికి సహకరించి సాయమందించాలని కోరారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

స్తంభాన్ని సరిచేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని నీలకంఠ రాజపురం ఎస్‌టి కాలనీ సమీపంలో మంగళవారం ఉదయం ట్రాన్స్‌కో అధికారులు కొత్తగా విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. కూలిన విద్యుత్ స్తంభం- వినియోగదారుల ఇక్కట్లు అన్న శీర్షికన ప్రజాశక్తిలో ప్రచురితమైన వార్తకు ఎఇ సూరిబాబు స్పందించి విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయాలని మండల లైన్ మ్యాన్ సోమిరెడ్డి అప్పలనాయుడుకు ఆదేశించారు. దీంతో ఆయన సిబ్బందితో వచ్చి విద్యుత్తు పనులను పూర్తి చేసి విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

గజపతినగరంలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి సుష్మ

గజపతినగరం: గజపతినగరం-2 సచివాలయం పరిధిలో బుదవారం మరుపల్లి పిహెచ్‌సి వైద్యాధికారి సుష్మ ఫ్యామిలీ డాక్టర్ సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ, పాఠశాలలో పిల్లలకు, వృద్ధులకు మొత్తం 109 మందికి బి.పి, షుగర్ వంటి వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు ఇచ్చామన్నారు. ఈ ఫ్యామిలీ డాక్టర్ సేవలను గ్రామస్థాయిలో అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి ఎన్.శివాని, ఎఎన్ఎం ఎస్.బేగం, ఆశ పి. పైడిరాజు, డిఇఒ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- భామిని

మండలంలోని పసుకుడి గ్రామానికి చెందిన గౌడు రవి (33) రోడ్డు ప్రమాదంలో చనిపోయిన ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం.. గౌడు రవి మంగళవారం రాత్రి 9గంటల సమయంలో గేదల మంద నుండి స్వగ్రామం పసుకుడి వచ్చే క్రమంలో భామిని మోడల్ స్కూల్ సమీపంలో బండి అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో స్థానికులు ఆయన్ను భామిని పిహెచ్‌సికు అక్కడి నుంచి సీతంపేట ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కి తరలించే క్రమంలో మార్గం మధ్యలో చనిపోయాడు. అతనికి భార్య జ్యోతి, కుమారుడు సాయి, కుమార్తె రియా వుంది. బత్తిలి ఎస్ఐ వై. అమ్మన్నారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

నేరాలు ఘోరాలు

చెట్టు నుంచి జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కురుపాం

మామిడి చెట్టు నుండి జారిపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో గుమ్మలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు అందించిన వివరాల ప్రకారం.. నందేడ మోహనరావు (40) గ్రామ సమీపంలో గల మామిడి తోటలో కాయలు కోసం చెట్టు ఎక్కి జారిపడి అక్కడకక్కడే మృతి చెందాడు. మృతుడుకు ఇద్దరు ఆడ పిల్లలు, ఒక కుమారుడు, భార్య ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి మృతదేహాన్ని తరలించినట్లు తెలిపారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కారు ఢీ కొని ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి- బొండపల్లి

మండలంలోని గరుడుబిల్లి జంక్షన్ జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొట్టిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. మెంటాడ మండలం జీడివలస గ్రామానికి చెందిన బత్తిన కోటేశ్వరరావు, ఆదిలక్ష్మిలు ఇద్దరు ద్విచక్ర వాహనంపై విజయనగరం వెళుతుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వారిద్దరికీ గాయాలయ్యాయి. ఇదే సమయంలో విజయనగరం నుంచి వస్తున్న మరో కారు వెనుక నుంచి ముందున్న కారును ఢీ కొట్టింది. దీంతో ముందున్న కారు నుజ్జు నుజ్జు అయింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రకటన

మా క్లయింట్ అయిన LIC Housing Finance Ltd. Vizianagaram Branch వారు ఇచ్చిన బోగాట మేరకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా.

నా క్లయింట్ వ్యాపార లావాదేవీలలో శ్రీ చుక్క ఎర్ని వెంకట సింహాచలం నాయుడు S/o అప్పారావు, డోరు నెం. 9-93, బ్రహ్మణవీధి, జామి విలేజ్ మరియు మండలం, విజయనగరం జిల్లా. Housing Loan నిమిత్తం వచ్చిరి, వారి యొక్క లింకు డాక్యుమెంట్ నెం. 3787/1992 తేది 16/12/1992న, విజయనగరం సబ్ రిజిష్టర్ ఆఫీసు, దాసరి పైడితల్లి S/o (లేటు) నరిసింహులు, ఆయన కుమారులు, దాసరి పెద పైడితల్లి, దాసరి చిన పైడితల్లి అమ్మగా, దున్న గణపతిరావు S/o (లేటు) స్వామి, వారు కొనియున్నారు. ఆస్తి 146.66 గజాలు, S.No. 2/13,14 మరిచర్ల గ్రామం మధుర రీమాపేట, విజయనగరం జిల్లా అయిన ఒరిజినల్ క్రయ పత్రం ఆయన ప్రయాణంలో పోయినది అవి అది ఈ రోజువరకు దొరకలేదు అని, ఆ క్రయ పత్రంను ఎవరివదు ఎప్పుడును తనఖా చేయలేదని చెప్పియున్నారు.

ఎవరి వద్ద అయిన ఆ క్రయ పత్రం తనఖా ఉన్న యెడల పైన ఉన్న చిరునామా వారికి, ఈ దినము లగాయితు 14 దినములలోపు వ్రాత పూర్వకంగా తెలియజేయవలెను. తదుపరి అభ్యంతరములు చెల్లనివగా తెలియజేయున్నాం.

C.S.Bhagavan, B.Com, B.L
Advocate, Vizianagaram
Cell: 9441910030